సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 14 । డిసెంబర్ । 2023





## గుడ్డు.. సరికొత్త రికార్డు

కోడిగుడ్డు ధర కొండెక్కింది.. జాతీయ గుడ్ల సమన్వయ కమిటీ (నెక్) చరిత్రలో సరికొత్త రికార్డును నమోదు చేసింది.

II లో



## మేలైన విత్తనాలతో దిగుబడులు

మేలైన యాజమాన్య పద్ధతులు, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డీకే యాదవ్ సూచించారు.

## 6,100 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం డెల్టా కాలువలకు 6,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,800, మధ్య డెల్టాకు 300, పశ్చిమ డెల్టాకు 3వేల క్యూసెక్కులు వదిలారు. అలాగే 12,124 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

## న్యూస్‌రీల్

### ప్లంబింగ్ కోర్సులో శిక్షణ

**రాజమహేంద్రవరం రూరల్:** కలెక్టరేట్ ఆవరణలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నేక్) ఆధ్వర్యంలో ప్లంబింగ్ సూపర్ వైజర్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా స్కిల్ కాలేజ్ కో ఆర్డినేటర్ డాక్టర్ అల్లంరాజు శ్రీరామ చంద్రమూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఏదేనా డిగ్రీ, ఆపైన చదివిన గ్రామీణ ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. మూడు నెలల శిక్షణలో ఉచితంగా వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని, శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. ప్లంబింగ్ సూపర్ వైజర్ శిక్షణకు అవసరమైన సామగ్రి, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తామన్నారు. ఆసక్తి కలవారు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(నేక్), కలెక్టరేట్ కాంపౌండ్, బొమ్మూరు చిరునామాకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### ఎన్నికల శిక్షణ తరగతులకు కలెక్టర్

**సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం):** జిల్లా కలెక్టర్ మాధవీలత ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ జిల్లా ఎన్నికల అధికారులకు నిర్వహించే మూడు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆమె పాల్గొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు ఈనెల 14 నుంచి 16వ తేదీవరకూ శిక్షణ ఇవ్వనున్నారు.

### నేటి నుంచి విద్యుత్ పొదుపు వారోత్సవాలు



డిప్యూటీ ఈఈ పి.అచ్చుతాచారి

**కొవ్వూరు:** ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈపీడీసీఎల్ డిప్యూటీ ఈఈ పి.అచ్చుతాచారి తెలిపారు. గురువారం విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన,వకృత్వం,చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహిస్తామన్నారు. స్టార్ రెటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలు, వినియోగంపై అవగాహన కల్పిస్తామన్నారు.విద్యుత్ పొదుపు అవశ్యకత–కొత్త సాంకేతిక విజ్ఞానం అనే అంశంపై ఇంజినీరింగ్ కళాశాలల్లో వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులతో జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఇప్పిస్తామన్నారు. 20న విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

### జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదల

**సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం:** జిల్లాలో స్వీప్ ద్వారా రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున కొత్త ఓటర్లను నమోదు చేయించినట్లు జేసీ తేజ్ భరత్ తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో రాజకీయ నాయకులతో ఆయన భేటీ అయ్యారు. ఈనె 9 వరకు ఓటు నమోదుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. స్వీప్ కార్యకలాపాలకు నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ నెల 26 నాటికి పరిశీలన పూర్తవుతుందన్నారు. మార్పులు, చేర్పుల అనంతరం జనవరి 5న తుది జాబితా ప్రచురిస్తామన్నారు. ఫారం 6 నేరుగా గానీ, ఆన్‌లైన్‌లో గాని ఇప్పుడు కూడా ఇవ్వవచ్చునన్నారు. పేర్ల తొలగింపునకు సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశామన్నారు.

### విద్యార్థి విభాగం జోన్ ఇన్‌చార్జిగా ఆనంద్‌కుమార్

ఇతర జిల్లాలకు నియామకాలు



నీలి వీర ఆనంద్‌కుమార్

**కాకినాడ:** వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల జోనల్ ఇన్‌చార్జిగా నీలి వీర ఆనంద్‌కుమార్ (తూర్పుగోదావరి) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆమోదంతో పార్టీ కేంద్ర కార్యాలయం ఈ నియామకాన్ని ప్రకటించింది. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఆయన విద్యార్థి విభాగంలో జోనల్ ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. అలాగే విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఇద్దరికి ప్రాతినిధ్యం కల్పించారు. రాష్ట్ర కార్యదర్శిగా చోడే సాయికృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కాశి ఆశిష్‌లను నియమించారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి ఆ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా రాయుడు రాకేష్, సంయుక్త కార్యదర్శిగా వీరంశెట్టి సురేంద్ర నియమితులయ్యారు.

# సంక్షేమానికి స్వర్ణయుగం

- సీఎం జగన్ పాలనలో అభివృద్ధి పరుగులు
- నాలుగున్నరేళ్లలో భారీ స్థాయిలో నిధుల వెచ్చింపు
- 33 పథకాలు, అభివృద్ధి పనుల అమలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



బుక్‌లెట్ అంజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస నాయుడు

**సాక్షి, రాజమహేంద్రవరం:** సంక్షేమ చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖితమైంది. అభివృద్ధి పరుగులు పెడుతోంది. తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలు స్వయంగా చూసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే వాటిని తొలగించేందుకు తీసుకొచ్చిన నవరత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లల్లో దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలకు రూ.వేల కోట్ల నిధులు వెచ్చించారు. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే రూ.25,436 కోట్లు ఖర్చుపెట్టారు. ఫలితంగా నిరుపేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. పేద, మధ్యతరగతి వర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. పార్టీ, వర్గం, కులం తదితర భేదాలు లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని గడప వద్దకే అందిస్తున్నారు. ప్రభుత్వ సుపరిపాలనను గమనించిన ప్రజలు మరోసారి జగనే సీఎం కావాలని ఆకాంక్షిస్తున్నారు.

**గతంలో అధ్వానం**

గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకంలో లబ్ధి పొందాలంటే ఆ పార్టీ నాయకులు, సానుభూతిపరులై ఉండాలి. టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యుల సిఫారసు తప్పనిసరి. ఆపై పథకానికి ఇంత అని ధర నిర్ణయించి మరీ వసూలు చేసేవారు. వారు చెప్పిన మొత్తం ముట్టజెప్పాల్సిన పరిస్థితి. పైగా కాళ్లరిగేలా అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి.

**నయాపైసా లంచం లేకుండా..**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నయా పైసా లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా గుమ్మం వద్దకే అందిస్తున్నారు. గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా ధ్రువీకరణ పత్రాల జారీ సైతం సులభతరం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రజలు, రైతులు, విద్యార్థులకు అవసరమైన సేవలు అందిస్తున్నారు.

**పెద్ద ఎత్తున ప్రాధాన్యత భవనాలు**

పాలనలో అధికారులు, సిబ్బందికి శాశ్వత వసతులు కల్పించాలన్న తలంపుతో శాశ్వత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీలు, ఆస్పత్రులు, జగనన్న ఇళ్లు, సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు ఇలా శాశ్వత భవనాలు రూపుదిద్దుకున్నాయి. నాడు–నేడులో 1,069 పాఠశాల భవనాలకు రూ.369.89 కోట్లు వెచ్చించారు.



సచివాలయం వద్ద సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా

**జిల్లాలో సంక్షేమ పథకాల వివరాలు**

| పథకం | లబ్ధిదారులు | అందించిన మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| వైఎస్సార్ కాపునేస్తం | 31,389 | 174.44 |
| రైతు భరోసా | 1,33,502 | 584.66 |
| ఆరోగ్యశ్రీ | 1,69,048 | 315.65 |
| ఆరోగ్య ఆసరా | 86,141 | 46.94 |
| నేతన్న నేస్తం | 916 | 8.79 |
| ఉచిత పంటల బీమా | 67,513 | 102.38 |
| పంట రుణాలు | 27,183 | 5.01 |
| ఇన్‌పుట్ సబ్సిడీ | 52,182 | 63.97 |
| చేదోడు | 13,491 | 35.61 |
| విద్యాదీవెన | 70,241 | 142.99 |
| వసతి దీవెన | 69,098 | 65.56 |
| అమ్మ ఒడి | 1,56,000 | 234 |
| బ్యాంక్ లింకేజీ | 84,593 | 15969.85 |
| సున్నా వడ్డీ | 33,498 | 145.94 |
| వైఎస్సార్ ఆసరా | 27,417 | 728.9 |
| పింఛన్ కానుక | 2,44,989 | 3048.16 |
| జగనన్న తోడు | 1,12,217 | 167.61 |
| శ్రీనిధి | 81,141 | 374.58 |
| కల్యాణమస్తు, షాదీతోఫా | 1,307 | 9.82 |

**అర్హతే ప్రామాణికం**



ప్రభుత్వ ప్రాధాన్యత, ఉద్దేశం ప్రకారం అర్హతను ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నాం. నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే నగదు జమ చేస్తుండటంతో అక్రమాలకు అడ్డుకట్ట పడింది. గ్రామ, వార్డు సచివాలయాల వలంటీర్ల ద్వారా ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తుండటంతో వృద్ధులకు స్వాంతన చేకూరుతోంది. కలెక్టర్‌గా రూ.25,436 కోట్లను జిల్లాలో అభివృద్ధి వెచ్చించడం గర్వంగా ఉంది.

– కె.మాధవీలత, కలెక్టర్

పేదలందరికీ గృహాల్లో 68,518 మందికి రూ.1233.34 కోట్లు, 336 గ్రామ సచివాలయాలకు రూ.108.47 కోట్లు, 279 రైతు భరోసా కేంద్రాలకు రూ.52.31 కోట్లు, 208 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు రూ.38.17 కోట్లు ఖర్చు చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో 1,443 పనులకు రూ.52.89 కోట్లు ఖర్చు చేశారు. 3,079 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. 15,369 చిన్న పరిశ్రమలకు రూ.670.85 కోట్లు రాయితీలు అందించారు.

**సంక్షేమ వసంతం**

సంక్షేమ పథకాల అమలులో నూతన ఒరవడి తీసుకొచ్చారు. అమ్మ ఒడితో పేదల చదువులు గట్టెక్కిస్తున్నారు. ఒకటో తేదీన కోడి కూయక మునుపే వలంటీర్ తలుపుతట్టి లబ్ధిదారుల చేతిలో పింఛన్ పెడుతున్నారు. అనారోగ్యమొస్తే చాలు ఆరోగ్యశ్రీ కార్డుతో ఆస్పత్రికి ధైర్యంగా వెళ్లి చికిత్స పొందే వెసులుబాటు కల్పించారు.

**ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూ..**

వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేపట్టిన మేలును వివరించేందుకు, తిరిగి రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలన్న విషయమై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలోని ఒక్కో కుటుంబం నాలుగున్నరేళ్లలో ఏ మేరకు లబ్ధి పొందిందో అధికారులు, ప్రజా ప్రతినిధులు వివరిస్తున్నారు. కేవలం మాటలతో కాకుండా గణాంకాలతో కూడిన బుక్‌లెట్‌లు పంచుతున్నారు. లబ్ధి పొందిన ప్రజల జాబితాను సచివాలయ వద్ద ప్రదర్శిస్తున్నారు.

**5.80 లక్షల బుక్‌లెట్ల పంపిణీ లక్ష్యం**

సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా 5.80 లక్షల కుటుంబాలకు వీటిని పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో కుటుంబానికి ఒక బుక్‌లెట్ చొప్పున పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే 80 శాతం పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమం విస్తృతంగా జరుగుతోంది.

**నాలుగున్నరేళ్లలో రూ.25,436 కోట్లు**

పేదలు, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ఎన్నికల హామీ మేరకు మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన విధంగా 'నవరత్నాలు' పేరుతో తొలుత 9 రకాల (అమ్మ ఒడి, విద్యాదీవెన, రైతు భరోసా, ఆరోగ్యశ్రీ, చేయూత, రుణమాఫీ, పింఛను కానుక, రుణమాఫీ) పథకాలు తీసుకొచ్చారు. వాగ్దానం చేసిన పథకాలే కాకుండా అదనంగా మరిన్ని పథకాలు కూడా అమలు చేస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 33 పథకాలతో ప్రజలకు మేలు చేకూరుస్తున్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ, ఎక్కడా లేని విధంగా సంక్షేమం, అభివృద్ధికి నిధులు వెచ్చిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాగున్నరేళ్లలో జిల్లాకు రూ.25,436 కోట్లు వెచ్చించారు.

**అమ్మ ఒడితో చదువుకు ఆసరా..**



నా భర్త క్లెం రాజ్‌కుమార్ టైలరింగ్ పనిచేస్తారు. ఆయన సంపాదన కుటుంబ పోషణకే సరిపోతుంది. పాప బాసంతిని చదివించాలంటే భారంగా ఉండేది. అమ్మఒడి పథకం వచ్చాక ఆ బాధ లేకుండా పోయింది. మూడేళ్లుగా ఆ పథకంతో వచ్చే డబ్బులతో చదివించుకుంటున్నా. ఇప్పటి వరకూ రూ.42,000 వేల లబ్ధి పొందాను. మళ్లీ జగనే సీఎం కావాలని దేవుడిని ప్రార్థిస్తున్నా.

– క్లెం సంధ్య, బ్రాహ్మణగూడెం

# ఘనంగా పవిత్రోత్సవాలు



విజయదుర్గా పీఠంలో పవిత్రోత్సవాల ముగింపు పూజలు

**రాయవరం:** మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిశాయి. తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామి, విజయ దుర్గాదేవి అమ్మవారికి పవిత్రోత్సవాలను నిర్వహించారు. వైఖానస పండితులు వి.పవన్‌కుమార్, ఆర్.సాయిరామాచార్యులు, ఎన్.సాయిగోపీకృష్ణ, యు.ఫణిసాగర్, పి.నరహరి ఆధ్వర్యంలో విజయ దుర్గా అమ్మవారికి అర్చనలు, స్వామివారికి, అమ్మవార్లకు అర్చనలు, హోమం, పూర్ణాహుతి జరిపారు. ఈ సందర్భంగా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) మాట్లాడుతూ పవిత్రోత్సవాల విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు పూర్ణాహుతితో ముగిశాయి. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు కందర్ప హనుమాన్, పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి), విజయదర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, పెదపాటి శ్రీనివాసమూర్తి, సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీలు

**ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం సిటీ):** నన్నయ విశ్వవిద్యాలయం అంతర కళాశాలల యూత్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీలు బుధవారం ముగిశాయి. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో జరిగిన ముగింపు కార్యక్రమానికి అర్బన్ సీఐ సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎబిల్ రాజబాబు అధ్యక్షత వహించారు.

పురుషుల విభాగంలో భీమవరం డీఎన్ఆర్ కళాశాల ఓవరాల్ చాంపియన్ విజేతగా నిలిచింది. మహిళా విభాగంలో గోపన్నపాలెం ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల చాంపియన్ షిప్ విజేతగా నిలిచారు. డీఎన్ఆర్ భీమవరం కళాశాల విద్యార్థిని జస్వంత్ బెస్ట్ అథ్లెట్‌గా ఎంపికైంది. 21 కిలోమీటర్లు 10 కేఎంలో ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థి మోహన్ రావు గెలిచాడు. విజేతలకు ట్రోఫీలను అందజేశారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సంజయ్‌కుమార్ తదితరులు

# సానపడితే వజ్రాలే..

- క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం
- రేపటి నుంచి 'ఆడుదాం ఆంధ్ర' నిర్వహణ
- మట్టిలో మాణిక్యాలను వెలికితీసే ప్రయత్నం
- పేదలకు ఇదో చక్కని అవకాశం

**డెస్క్, రాజమహేంద్రవరం/సాక్షి, అమలాపురం/నాగమల్లితోట (కాకినాడ సిటీ):** క్రీడా మాణిక్యాలను వెలికితీయాలని రాష్ట్ర ప్రభుత్వం దృఢంగా సంకల్పించింది. పల్లె నుంచి పట్టణాల వరకూ ఆటల్లో ఉత్సాహమున్న వారందరినీ వెన్నుతట్టి ప్రోత్సహించాలని నిర్ణయించింది. దీనికోసం రూ.కోట్లు వెచ్చిస్తోంది. వివిధ క్రీడల్లో ప్రావీణ్యమున్న వారికి ఓ చక్కని అవకాశాన్ని కల్పిస్తోంది. దీనికోసం గ్రామ స్థాయి నుంచి పోటీలను నిర్వహించనుంది. 'ఆడుదాం ఆంధ్ర' పేరిట ఈ నెల 15 నుంచి జనవరి 26వ తేదీ వరకూ ఇదో పెద్ద పండగలా చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. వీటి నిర్వహణలో క్రీడాసాధికార సంస్థ నుంచి సచివాలయాల వరకూ పాలుపంచుకుంటున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఈ పోటీల్లో పాల్గొనేందుకు చాలామంది ఉవ్విళ్లూరుతున్నారు. ఈ నెల 13వ తేదీ నాటికి నాలుగు లక్షలకు పైగా పేర్లను నమోదు చేసుకోవడమే ఇందుకు తార్కాణం. చాలా మందిలో క్రీడా ప్రతిభ ఉంటుంది. కానీ ప్రోత్సహించే వారు లేక ముందంజ వేయలేకపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ వివిధ పోటీల్లో పాల్గొని చాలా మంది ప్రతిభ చాటుకుంటున్నారు. కానీ పాఠశాల స్థాయి పతకాలతో సరిపెట్టుకుని ఆగిపోతున్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఇలాంటి వారు జాతీయ స్థాయికి చేరేందుకు మార్గం సుగమమైంది. గ్రామీణ పాఠశాలల్లో చదువుతూ క్రీడల్లో మెరుస్తున్న కొందరు విద్యార్థులను పరిశీలిస్తే ప్రభుత్వం నిర్వహించే 'ఆడుదాం ఆంధ్ర' కాన్సెప్ట్ ఎంత ప్రాధాన్యం సంతరించుకోనుందో అర్థం చేసుకోవచ్చు.

**కాన్సెప్ట్ చాలా మంచిది**



ఈ బాలిక పేరు సన్నిప్రియ. యు.కొత్తపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. తండ్రి కరారాజు, తల్లి పావని. వీరిది మత్స్యకార కుటుంబం. ఆమెకు హాకీ అంటే ఇష్టం. రెండేళ్ల నుంచి ఆడుతోంది. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తోంది. క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది సన్నిప్రియ లక్ష్యం. ప్రస్తుతం మదనపల్లిలో జరిగే అండర్–14 పోటీల్లో పాల్గొనుంది. ఆడుదాం ఆంధ్ర కాన్సెప్ట్ తనకెంతగానో నచ్చిందని ఈ బాలిక సంతోషం వ్యక్తం చేస్తోంది.

**కొత్తవారికి అవకాశం**



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తానికి చెందిన అడబాల లక్ష్మి గ్రామ స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగింది. స్థానిక సీఎస్ఎం జూనియర్ కాలేజీ, గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సమయంలో పీడీ గొలకోటి ఫణీంద్ర, విజ్జూ, సరస్వతిల వద్ద శిక్షణ పొందింది. 2020లో జమ్మూ కశ్మీర్‌లో వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జూనియర్ నేషనల్ పోటీలలో పాల్గొంది. 2022లో భోపాల్‌లో నిర్వహించిన అండర్–19 ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటింది. ఈ ఏడాది న్యూఢిల్లీలో జరిగే అండన్ –19 ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనుంది. 'ఆడుదాం ఆంధ్ర పోటీలు సచివాలయ స్థాయి నుంచి నిర్వహించడం చాలా బాగుంది. ఇలా పోటీలు నిర్వహించడం వల్ల కొత్తవారికి అవకాశం వస్తోంది. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు గుర్తింపు వస్తోంది' అని లక్ష్మి తెలిపారు.

**ప్రో కబడ్డీలో జాతీయస్థాయికి..**




ఈ కుర్రాడి పేరు పెదకాపు జాన్‌బాబు. తండ్రి సతీష్, తల్లి నాగమణి. తల్లిదండ్రులు ఓ ఫ్యాక్టరీలో పనికి వెళ్లి కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. జాన్‌బాబుకు కబడ్డీ అంటే ఇష్టం. ఇందులో మంచి క్రీడాకారుడు అవ్వాలనేది అతని కోరిక. వాకలపూడి ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి చదువుతున్న అతను పీడీ శ్రీనివాస్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమైనప్పటికీ ప్రో కబడ్డీకి ఎంపికై కుటుంబానికి ఆసరాగా నిలవాలన్నది ఈ బాలుడి ఆశయం. ఈ ఏడాది నవంబర్‌లో రాజాంలో జరిగిన రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొన్నాడు. అన్నమయ్య జిల్లాలో ఈ నెల 27, 28, 30 తేదీలలో జరిగిన అండర్–14 జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర ద్వారా తనలాంటి ఎందరికో ప్రోత్సాహం లభిస్తుందని విశ్వసిస్తున్నాడు.

**పేద విద్యార్థులకు ప్రోత్సాహం**



ఈ అమ్మాయి పేరు ద్వామా నందిని. కాకినాడ పల్లిపేటలో ఉంటున్న ఈ బాలిక గొడారిగుంట మదర్‌థెరిసా మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. తల్లి భూలక్ష్మి ఇళ్లలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. నందిని 2021 నుంచి పాఠశాలలో ఖోఖో ఆడుతోంది. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్–17 నాసిక్‌లో గత నెలలో జరిగిన నేషనల్ స్కూల్ గేమ్స్‌లో పాల్గొంది. ఇప్పటి వరకు 4 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని నేషనల్స్‌కు ఎంపికైంది. కోచ్ శ్రీనివాస్ వద్ద శిక్షణ పొందుతోంది. ఆడుదాం ఆంధ్రతో తనలాంటి పేద కుటుంబానికి చెందిన వారికి ప్రోత్సాహం లభిస్తుందని నందిని చెబుతోంది.



# రౌడీమూకలపై కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ పి.జగదీష్ హెచ్చరిక



**కంబాలచెరువు(రాజమహేంద్రవరం):** ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న రౌడీ మూకలు జైలు పాలు కావడం తప్పదని జిల్లా ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ కె.మాధలత ఆదేశాల మేరకు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో దుర్గనగర్‌కు చెందిన ఎర్ర సాయికిరణ్ అలియాస్ దొంగసాయిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఆ వివరాలను జిల్లా ఎస్పీ బుధవారం వివరించారు. ఎర్ర సాయికిరణ్‌పై జిల్లాలో సుమారు ఆరు కేసులు నమోదయ్యాయన్నారు. ఇందులో ఒకటి హత్య కేసు, రెండు గంజాయి కేసులు, రెండు చోరీ కేసులు, ఒక గొడవ కేసు ఉన్నాయన్నారు. అనేకసార్లు చట్టపరమైన చర్యలు తీసుకున్నప్పటికీ ఇతని ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాకపోవడంతో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి జైలుకు తరలించామన్నారు. బ్లేడ్ బ్యాచ్, రౌడీలు మూకలు వ్యవస్థీకృత నేరాలకు అలవాటు పడి ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తే సహించేది లేదన్నారు.వారి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికి, నేరం చేయాలనే ఆలోచన నుంచి దృష్టి మరల్చడానికి పీడీ యాక్ట్‌ను ప్రయోగిస్తామన్నారు.

## క్లుప్తంగా

### పిఠాపురం రైల్వే స్టేషన్‌లో ఆందోళన

పరిస్థితిని చక్కదిద్దిన పోలీసులు



పిఠాపురం రైల్వే స్టేషన్లో ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

కొత్తపల్లి: పిఠాపురం రైల్వే స్టేషన్‌లో బుధవారం రాత్రి ప్రయాణికుల మధ్య ఘర్షణ ఉద్రిక్తతకు దారితీసింది.. పోలీసుల కథనం ప్రకారం.. షాలిమార్ నుంచి త్రివేండ్రం వెళ్తున్న రైలు పిఠాపురం రైల్వే స్టేషన్‌కు బుధవారం రాత్రి వచ్చింది. అప్పటికే రైలు అంతా ప్రయాణికులతో కిక్కిరిసి ఉంది. రిజర్వేషన్ బోగీల్లో ఎక్కువగా అయ్యప్పస్వామి మాలధారులు ఉన్నారు. ఇందులో సాధారణ ప్రయాణికులంతా ఎక్కి గుట్కాలు వేసి రైలును అధ్వానంగా మార్చుతున్నారంటూ అయ్యప్ప స్వామి భక్తులంతా ఆందోళన చెందారు. రిజర్వేషన్ బోగీల్లో నిలిచి ఉన్న సాధారణ ప్రయాణికులను వారు కిందకి దించేశారు. దీంతో సాధారణ ప్రయాణికులు ఆందోళనకు దిగారు. రైలు ముందు నిరసన తెలిపారు. పోలీసులు పలువురిని రైలు ఎక్కించే ప్రయత్నం చేశారు. ఇంకా చాలామంది స్టేషన్‌లో ఉండిపోయారు. గంట పాటు రైల్వే స్టేషన్‌లో ఉండిపోవడంతో అయ్యప్ప భక్తులు, సాధారణ ప్రయాణికుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎట్టకేలకు పోలీసులు రైలు నుంచి దింపేసిన వారిని ఇతర రైళ్లలో పంపించారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది.

### డివైడర్‌ను ఢీకొని లారీ బోల్తా

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



దూబచర్ల వద్ద బోల్తా పడిన లారీ

నల్లజర్ల: దూబచర్ల సమీపంలో బైపాస్ రహదారిపై బుధవారం తెల్లవారు జామున 5 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వైపు పురికొస లోడుతో వెళ్తున్న లారీ దూబచర్లకు వచ్చేసరికి ఓ మతిస్థిమితం లేని వ్యక్తిని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొంది. దీంతో పక్కనే రహదారిపై పడింది. ఈ సంఘటనలో మతిస్థిమితం లేని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ మద్దెల సుధాకర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గుడ్డు.. సరికొత్త రికార్డు

- పౌల్ట్రీ చరిత్రలో అత్యధిక ధర నమోదు
- రూ.5.76కు చేరిన పౌల్ట్రీ రైతు ధర
- నాలుగేళ్ల తర్వాత అత్యధికంగా..





అలమూరు: కోడిగుడ్డు ధర కొండెక్కింది.. జాతీయ గుడ్ల సమన్వయ కమిటీ (నెక్) చరిత్రలో సరికొత్త రికార్డును నమోదు చేసింది. ప్రస్తుతం పౌల్ట్రీ వద్ద గుడ్డు రైతు ధర రూ.5.76కు చేరడంతో పాత రికార్డులను తిరగరాసింది. నాలుగేళ్ల కాలంలో ఇదే అత్యధిక రైతు ధర కావడం విశేషం. ఇబ్బడిముబ్బడిగా పెరిగిన మేత ధరలతో గుడ్డు ధర పెరిగినా ప్రయోజనం అంతంత మాత్రమేనని కోళ్ల రైతులు అంటున్నారు. మరోపక్క రిటైల్ మార్కెట్‌లో గుడ్డు రూ.7కు చేరడంతో వీటి కొనుగోలుకు సామాన్యులు గుడ్లు తేలేస్తున్నారు. కార్తిక మాసం పూర్తి కావడంతో పాటు వచ్చే క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి కేక్‌ల తయారీలో అధికంగా గుడ్లు ఉపయోగించడం వల్ల వాటి ధర మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 200 వరకూ పౌల్ట్రీలు ఉన్నాయి. ఇందులో మండపేట, అనపర్తి, పెద్దాపురం, జగ్గంపేట, రాజానగరం, రంగంపేట, రాజమహేంద్రవరం రూరల్, ఆలమూరు మండలాల్లో ప్రధానంగా ఈ పౌల్ట్రీలు నడుస్తున్నాయి. ఆయా చోట్ల మొత్త గుడ్లు పెట్టే కోళ్లు 1.4 కోట్ల వరకూ ఉండగా, రోజుకు సరాసరి 1.20 కోట్ల వరకూ కోడిగుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో 60 శాతం మేర గుడ్లు ఒడిశా, బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండగా, మిగిలినవి స్థానికంగా వినియోగిస్తున్నారు. శీతాకాలంలో ఉత్తరాది రాష్ట్రాల్లో చేపల లభ్యత తక్కువగా ఉండటంతో గుడ్ల వినియోగం పెరుగుతుంది. ఇందులో భాగంగా గుడ్ల ఎగుమతులు పుంజుకొని ధర ఆశాజనకంగా ఉంటుంది. ఏటా శీతాకాలంలో అత్యధిక రైతు ధర నమోదయ్యేది కాని ఈ ఏడాది మాత్రం రికార్డు స్థాయికి చేరుకుని కోళ్ల రైతులను సైతం ఆశ్చర్యపరిచింది. 2017 సీజన్‌లో రైతు ధర దాదాపు రూ.5.45కు చేరి అత్యధిక ధరను నమోదు చేసుకుంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పౌల్ట్రీలు విస్తరించడం, ఎగుమతుల్లో ఇతర రాష్ట్రాల పోటీతో నాలుగేళ్లుగా పౌల్ట్రీ రంగం గడ్డుకాలం ఎదుర్కొంటోంది. నాలుగేళ్ల నుంచి సీజన్‌లో సైతం రైతు ధర రూ. ఐదు దాటడం గగనమైంది. ఈ సీజన్‌లో చలి తీవ్రత పెరగడంతో ఆ మేరకు జిల్లా నుంచి గుడ్ల ఎగుమతులకు డిమాండ్ ఏర్పడి ధర ఆశాజనకంగా ఉందని పౌల్ట్రీ వర్గాలంటున్నాయి. రైతు ధర బుధవారం రూ. 5.76కు చేరి సరికొత్త రికార్డును నెలకొల్పింది. శీతల ప్రభావం నేపథ్యంలో కొద్ది రోజుల పాటు ధర కొనసాగవచ్చని భావిస్తున్నారు.

### ప్రయోజనం నామమాత్రం

ప్రస్తుతం గుడ్డు రైతు ధర ఆశాజనకంగా ఉండటం కొంత ఊరట ఇస్తున్నా పెరిగిన మేత ధరలతో ప్రయోజనం అంతంత మాత్రమేనని కోళ్ల రైతులు అంటున్నారు. కోళ్లకు వేసే వ్యాక్సిన్లు, మందులు, కార్మికుల జీతాలు పెరిగిపోవడం పౌల్ట్రీల నిర్వహణ వ్యయాన్ని గణనీయంగా పెంచేసిందని చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏడాది సగటు రైతు ధర రూ. ఐదు ఉంటేనే కాని గిట్టుబాటు కాదని, గత ఏడాది సగటు ధర రూ. 4.39 మాత్రమే ఉండటంతో ఆ మేరకు నష్టాలు చూడాల్సి వచ్చిందంటున్నారు. కోడి మేతకు వినియోగించే మొక్కజొన్న, సోయా, నూకలు తదితర వాటిని పౌల్ట్రీలకు రాయితీపై సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### వినియోగదారులపై భారం

తక్కువ ధరలో పౌష్టికాహారాన్ని అందించే కోడిగుడ్లను సామాన్య, మధ్య తరగతి ప్రజలు అధికంగా వినియోగిస్తారు. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో రూ.ఏడు నుంచి రూ.7.50 పలుకుతుండటంతో సామాన్యులు వాటిని కొనుగోలు చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. రిటైల్ మార్కెట్‌లో గుడ్డు ధర బాగా పెరిగిపోవడం పౌల్ట్రీ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. అధిక ధరతో వినియోగం తగ్గితే ఆ ప్రభావం మళ్లీ పరిశ్రమపై పడుతుందంటున్నా రు. కోడిగుడ్డు ధర ఒక్కసారిగా పెరిగినా లేదా ఒకేసారి తగ్గినా ఆ ప్రభావం రంగంపై విస్తృతంగా ఉంటుందని కోళ్ల రైతులు ఆందోళన చెందుతున్నారు.

### మేత ధరలు తగ్గితేనే ఊరట



గతంతో పోలిస్తే ఈ సీజన్‌లో గుడ్డు అత్యధిక రైతు ధరను నమోదు చేసుకుంది. ప్రస్తుతం రైతు ధర ఆశాజనకంగా ఉన్నా కోడి మేత ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి. మేత రేట్లు అందుబాటులోకి వస్తేనే పరిశ్రమకు ఊరట. కోడి మేతను రాయితీపై పౌల్ట్రీలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కో రుతున్నాం. ఇదే ధర కొంత కాలం కొనసాగితే రైతులు నష్టాల నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.

–పడాల సుబ్బారెడ్డి,
ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ,
అర్తమూరు

# మేలైన విత్తనాలతో నాణ్యమైన దిగుబడులు

- ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డీకే యాదవ్
- అట్టహాసంగా సీటీఆర్ఐ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు



సీటీఆర్ఐ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ఐసీఏఆర్ ఏడీజీ డీకే యాదవ్, పూర్వపు డైరెక్టర్లు తదితరులు



సీటీఆర్ఐ సంస్థ రూపొందించిన సంచికలను ఆవిష్కరిస్తున్న ఐసీఏఆర్ ఏడీజీ యాదవ్, ఎంపీ భరత్‌రామ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే నాణ్యమైన విత్తనాలు, మేలైన యాజమాన్య పద్ధతులు, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి విత్తన వాణిజ్య పంటల అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డీకే యాదవ్ సూచించారు. బుధవారం స్థానిక సీటీఆర్ఐ కార్యాలయంలో డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అధ్యక్షతన కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ) 75 ఏళ్ల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలను ముఖ్య అతిథిగా హాజరైన యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1947లో చిన్న పరిశోధన కేంద్రంగా గుంటూరులో ప్రారంభమై ఇంతింతై వటుడింతై అన్న చందంగా దేశంలోనే పొగాకు పంటకు ఏకైక ప్రతిష్ఠాత్మక పరిశోధనా సంస్థగా అవతరించిందన్నారు. ఇటీవల కాలంలో వాతావరణంలో మార్పులు వ్యవసాయ రంగంపై పెను ప్రభావాన్ని చూపుతున్నాయన్నారు. దీని వల్ల రైతులకు అపార నష్టం సంభవిస్తుందన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలను రూపొందించేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు.

### నాణ్యమైన వంగడాలకు కృషి

పొగాకు పంటలో అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన వంగడాల అభివృద్ధికి శాస్త్రవేత్తలు కృషి చేయాలని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మార్కెట్లో మన దేశ నాణ్యమైన పొగాకుకు మంచి డిమాండ్ ఉందని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. అధిక ఆదాయాన్నిచ్చే పసుపు, మిరప లాంటి పంటల వైపు కూడా రైతులు దృష్టి సారించాలన్నారు. కడియంలో 25 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పూల నర్సరీలు ఉన్నాయని, దీనికోసం ప్రత్యేక పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. మిచాంగ్ తుపాన్‌తో నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకోవాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్‌కు ఎంపీ విన్నవించారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ పొగాకు సాగులో ఖర్చులను తగ్గించడానికి కృషి చేయాలన్నారు. పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ వాణిజ్య పటంలో దేశానికి చోటు లభించేలా పొగాకు రైతులను నిలపడంలో కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ అద్భుతమైన కృషి చేసిందన్నారు. ఇక్కడి నేలలు, వాతావరణం పొగాకు సాగుకు అత్యంత అనుకూలమైనవన్నారు. విదేశీ మారక ద్రవ్యాన్ని పొందడానికి పొగాకు పంట ఉపయోగపడుతుందన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడుతూ పొగాకు పంట దేశ ఆర్థిక ప్రగతికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.పద్మరాజు మాట్లాడుతూ మన ప్రాంతాల్లో పొగాకు ప్రధాన పంటని, ఈ సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుగొనేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్ మాట్లాడుతూ కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ 75 ఏళ్ల ప్రస్థానాన్ని, సాధించిన విజయాలను వివరించారు. పొగాకు పంటపై జరుగుతున్న పరిశోధనలను సమగ్రంగా తెలిపారు. 75 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానానికి చిహ్నంగా నిర్మించిన ప్రత్యేక పైలాన్‌ను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెస్ స్వామినాథన్ అంతర్జాతీయ అతిథి గృహాన్ని ప్రారంభించారు. ప్లాటినం జూబ్లీ ఉత్సవాల సందర్భంగా సంస్థ రూపొందించిన పది సంచికలను అతిథులు ఆవిష్కరించారు. పొగాకు పంటకు సంబంధించి సంస్థ రూపొందించి విడుదల చేసిన వంగడాలతో కూడిన వివరాలు, మేలైన యాజమాన్య పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, విత్తనం దగ్గర నుంచి పంట కోత వరకు, కోతానంతర పరిజ్ఞానానికి సంబంధించి వివరాలతో కూడిన ప్రదర్శనను అతిథులు ప్రారంభించారు.

### పూర్వపు డైరెక్టర్లు, రైతులకు సత్కారం

సంస్థ అభివృద్ధికి విశేషంగా సేవలు అందించిన పూర్వ డైరెక్టర్లు దేవ్‌సింగ్, కృష్ణమూర్తి, టీజీకే మూర్తిలను ఘనంగా సత్కరించారు. పొగాకు పంటను చాలాకాలంగా సాగు చేసి, ఇతర రైతులకు ఆదర్శంగా ఉన్న గద్దె లక్ష్మణరావు, కొండారెడ్డి, సురేంద్ర, చైతన్యకుమార్, కాట్రగడ్డ సత్యనారాయణ, ఫణికుమార్‌లను అభినందించారు. సంస్థ ఉద్యోగులు వైవీ సూర్యనారాయణ, ఆర్.సుధాకర్, ఎం.రాంబాబు, ఎ.శ్రీధర్, పి.కోటబాబు, ఇ.రాధాకృష్ణలను సన్మానించారు. సదస్సులో కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

### ఆలోచింపజేసిన ‘లక్ష్మణరేఖ’ నాటకం



లక్ష్మణరేఖ సాంఘిక నాటకంలో ఓ సన్నివేశం

యానాం: నేటి సమాజంలో యువత తల్లిదండ్రుల మాట సైతం లెక్కచేయకుండా మద్యానికి, చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారు.. వివాహ నిర్ణయాలు సైతం సొంతంగా తీసుకోవడం అనంతరం జరిగిన పరిణామాలు విషాదకరంగా మారడం ఇతివృత్తంగా ప్రదర్శించిన ‘లక్ష్మణరేఖ’ సాంఘిక నాటకం అందరినీ ఆలోచింపజేసింది. బుధవారం రాత్రి స్థానిక కనకాలపేట గ్రామంలో 46వ కార్తిక దీపారాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన కళాకారులతో కూడిన శ్రీశ్రీనివాసా కళామండలి ఆధ్వర్యంలో నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకానికి దర్శకత్వం తోట భైరవ స్వామి(పోలీస్) చేయగా దాడి జగన్నాథరావు రచించారు. ఈ నాటకంలో పాత్రధారులు జక్కపు సత్తిబాబు, కోన సాయిరామ్, దేవకోన, పులిశెట్టి శ్రీనివాస్, గోర్రెల వీరబాబు, కృష్ణ, కె.శ్రీనివాస్, వెంకటరమణ, అను, గోవిందు, బుజ్జి, విజయ్ చక్కగా నటించడంతో అందరి ప్రశంసలు అందుకున్నారు.



### క్లాట్‌లో ‘శ్రీషిర్డీసాయి’ విద్యార్థుల ప్రతిభ



క్లాట్‌లో ర్యాంకులు సాధించిన శ్రీషిర్డీసాయి విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వివిధ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశానికి నిర్వహించే క్లాట్ (కామన్ లా అడ్మిషన్ టెస్ట్)లో షిర్డీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఆ విద్యా సంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య బుధవారం తెలిపారు. ఇంటర్‌తో పాటు డాఫ్నీ సివిల్స్ అకాడమీలో సివిల్స్, ఐపీమాట్, సీయూ సెట్‌లలో శిక్షణ పొందుతున్న కటారి లాస్య ఆల్ ఇండియా 7వ ర్యాంకు, వేముల శ్రీహర్ష ఆల్ ఇండియా 8వ ర్యాంకు, కె.డిలాన్ ఎడ్వర్డ్ 16వ ర్యాంకును కైవసం చేసుకున్నారని అన్నారు. టి.చిన్న 51వ ర్యాంకు, జి.సాయినిత్య 58వ ర్యాంకు, వి.వందన 5వ ర్యాంకుతో ఆరుగురు విద్యార్థులు 100 లోపు ర్యాంకులు సాధించడం విశేషమన్నారు. హాజరైన మొత్తం 55 మంది విద్యార్థులలో 36 మంది తొలి కౌన్సెలింగ్‌లోనే వివిధ న్యాయ విశ్వ విద్యాలయాల్లో న్యాయ విద్యను అభ్యసించడానికి అర్హత సాధించారన్నారు. అన్ని కౌన్సెలింగ్‌లలోనూ మొత్తం 42 మంది అర్హత సాధించే అవకాశం ఉందని ఆమె అన్నారు. ప్రతి ఏటా తమ విద్యార్థులు వివిధ జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాల్లో ఉన్నత విద్యకు అర్హత సాధించడం పట్ల శ్రీషిర్డీసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. విజేతలైన విద్యార్థులు, అందుకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని అభినందించారు.

### రెండు నెలల వేతనాలు విడుదల

రాయవరం: సమగ్ర శిక్షా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి రెండు నెలల వేతనాలు విడుదల చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదల అయ్యాయి. సమగ్ర శిక్షా కార్యాలయంలో పనిచేస్తున్న సీఆర్ఎంటీలు, మండల లెవల్ అకౌంటెంట్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఇంక్లుజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్లు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సైట్ ఇంజినీర్లు, మెసెంజర్లతో పాటు, ఇంక్లుజివ్ ఎడ్యుకేషన్ ఫిజియోథెరపిస్టులు, ఆయాలకు సెప్టెంబరు, అక్టోబర్ నెలలకు సంబంధించి వేతనాలు మంజూరయ్యాయి. సమగ్ర శిక్షా పరిధిలో పనిచేస్తున్న 506 మందితో పాటు, సమగ్ర శిక్షా కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా వేతనాలు మంజూరు చేశారు. మంజూరైన వేతనాలను గురువారం ఉద్యోగుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.కమలకుమారి, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

### మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఇంధన వనరులపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత శ్రద్ధ కనబరుస్తుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొన్నేళ్ల నుంచి విద్యుత్ వినియోగం బాగా పెరగడం, సహజ వనరుల పరిరక్షణ కోసం, గ్లోబల్ వార్మింగ్ నియంత్రణకు విద్యుత్‌ను పొదుపు చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. విద్యుత్ వినియోగదారులకు అనుకూలమైన ధరలకు విద్యుత్ సరఫరా చేయడానికి, జీవన ప్రమాణాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ఒక మహోద్యమంలా విద్యుత్ పొదుపు అమలుకు చర్యలు చేపట్టిందన్నారు. దీనివల్ల సహజ వనరులను ఎక్కువ కాలం ఉపయోగించుకోవచ్చని అన్నారు. దీనికోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక పథకాలు అమలు చేశామన్నారు. ఇందులో భాగంగా 25.76 లక్షల ఎల్ఈడీ బల్బుల పంపిణీ, 2973 ఎనర్జీ ఎఫిషియెంట్ మోటార్స్ రైతులకు ఉచితంగా అందించామన్నారు. రైతులకు 3,940 సోలార్ వ్యవసాయ కనెక్షన్లు అందజేశామన్నారు. స్టార్ రేటెడ్ విద్యుత్ పరికరాలను వినియోగించి విద్యుత్ వినియోగదారులంతా పొదుపు మహోద్యమంలో పాల్గొనాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు.

పర్యావరణం




శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి.
– లిసిప్రియ

# నిండు సభలో... నిగ్గదీసి అడిగిన అగ్గిస్వరం

**వాన కురిస్తే, హరివిల్లు విరిస్తే మురిసే చిన్నారి హృదయాలకు ప్రకృతి ఆత్మీయ నేస్తం. అలాంటి అందమైన, ఆత్మీయమైన ప్రకృతి ఎదుట విలయ విధ్వంసం కరాళనృత్యం చేస్తుంటే... లిసిప్రియలాంటి చిన్నారులు 'పాపం, పుణ్యం ప్రపంచ మార్గం' అని ఊరుకోరు. ప్రకృతికి సంబంధించి మనం చేస్తున్న పాపం ఏదో, పుణ్యం ఏదో కళ్లకు కట్టేలా ప్రచారం చేస్తారు. దుబాయ్‌లో జరిగిన 'యునైటెడ్ నేషన్స్ క్లైమెట్ చేంజ్ కాన్ఫరెన్స్–2023'లో తన నిరసనను బహిరంగంగా తెలియజేసింది మన దేశానికి చెందిన పన్నెండు సంవత్సరాల లిసిప్రియ కంగుజామ్. 'శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి' అంటూ నినదించింది. కొద్దిసేపు ప్రసంగించింది. ఆమె నిరసనను ప్రపంచ ప్రతినిధులు కొందరు చప్పట్లతో ఆమోదం పలికారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన మణిపుర్‌కు చెందిన క్లైమెట్ యాక్టివిస్ట్ లిసిప్రియ గురించి....**

లిసిప్రియ కంగ్‌జామ్ మణిపుర్‌లోని బషిక్‌హోంగ్‌లో జన్మించింది. తల్లిదండ్రుల ద్వారా, స్కూల్లో ఉపాధ్యాయుల ద్వారా విన్న పర్యావరణపాఠాలు ఈ చిన్నారి మనసుపై బలమైన ప్రభావాన్ని చూపాయి. పర్యావరణ సంరక్షణ కోసం తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది. ఏడు సంవత్సరాల వయసులోనే అందరూ ఆశ్చర్యపడేలా పర్యావరణ సంబంధిత విషయాలు మాట్లాడేది.

### నా నేరం ఏమిటి?

నిరసన తరువాత అధికారులు నన్ను 30 నిమిషాలకు పైగా నిర్బంధించారు. నేను చేసిన నేరం ఏమిటంటే పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారణం అయిన శిలాజ ఇంధనాలను దశల వారీగా తొలగించమని అడగడం. నన్ను 'కాప్ 28'లో లేకుండా చేశారు.

– లిసిప్రియ, యాక్టివిస్ట్

### యాక్ట్ నౌ

దుబాయ్‌లో జరిగిన క్లైమెట్ కాన్ఫరెన్స్–2023లో 190 దేశాల నుంచి 60,000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నారి ప్రియ ధైర్యంగా వేదిక మీదికి వచ్చి 'అవర్ లీడర్స్ లై, పీపుల్ డై' అని గట్టిగా అరిచింది. సదస్సు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ తరువాత ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి.

'ఎవరు ఈ అమ్మాయి?' అంటూ చాలామంది ఆరా తీశారు. చిన్న వయసు నుంచే పర్యావరణ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్న ప్రియ గురించి తెలుసుకొని ఆశ్చర్యానందాలకు గురయ్యారు.

2018లో ప్రకృతి విధ్వంసంపై మంగోలియాలో ఐక్యరాజ్య సమితి నిర్వహించిన సదస్సులో తండ్రితో కలిసి పాల్గొంది. ఈ సదస్సులో వక్తల ఉపన్యాసాల నుంచి ఎన్నో కొత్తవిషయాలు నేర్చుకుంది.

ఈ సదస్సు ప్రియ జీవితాన్ని మార్చేసిన సదస్సు అని చెప్పవచ్చు.

ఈ సదస్సు స్ఫూర్తితో 'చైల్డ్ మూమెంట్' అనే సంస్థను మొదలుపెట్టింది. మొక్కల పెంపకం వల్ల ప్రకృతికి జరిగే మేలు, ప్రకృతి విధ్వంసం వల్ల జరిగే నష్టాలు... మొదలైన వాటి గురించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్నో స్కూల్స్‌లో ప్రచారకార్యక్రమాలు విరివిగా నిర్వహించింది.

2019లో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరిగిన యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంది. ఇదే సంవత్సరం అంగోలా దేశంలో జరిగిన ఆఫ్రికన్ యూనియన్ సదస్సులో పాల్గొంది. ఈ సదస్సులో ఎంతోమంది దేశాధ్యక్షులతో పాటు ప్రియ ప్రసంగించడం విశేషం.

చిన్నవయసులోనే ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా పెద్ద పేరు తెచ్చుకుంది లిసిప్రియ.

ప్రియకు డబ్బులను పొదుపు చేయడం అలవాటు. అవి తన భవిష్యత్ అవసరాలకు ఉద్దేశించి కాదు. సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం కోసం పొదుపు చేస్తుంటుంది. 2018లో కేరళ వరద బాధితులకు సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి లక్షరూపాయలు విరాళంగా ఇచ్చింది. ఢిల్లీలోని వాయు కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని 'సర్వైవల్ కిట్ ఫర్ ది ఫ్యూచర్' అనే డివైజ్‌కు రూపకల్పన చేసింది. ఈ జీరో బడ్జెట్ కిట్ వాయుకాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఎవరైనా, ఎక్కడైనా సులభంగా తయారు చేసుకోవచ్చు. ఈ పరికరాన్ని పంజాబ్ అసెంబ్లీలో లాంచ్ చేసింది ప్రియ. వాతావరణ మార్పులపై కార్యచరణ కోసం, మన దేశంలో క్లైమెట్ లా కోసం వందలాదిమందితో కలిసి ఢిల్లీలోని ఇండియా గేట్ దగ్గర ప్రదర్శన నిర్వహించింది.

'సందేశం ఇవ్వాలనుకోవడం లేదు. సమస్యను అర్థం చేసుకోమని చేతులు జోడించి వినమ్రంగా వేడుకుంటున్నాను' అంటుంది లిసిప్రియ.



న్యూస్‌మేకర్
ఆషిక్

# కుమారునికి వంట నేర్పితే?

## ఏమవుతుంది?

**బహుశా 'మాస్టర్ చెఫ్' విజేతగా 25 లక్షలు ఇంటికి తీసుకొస్తాడు. అబ్బాయిలు వంట గదిలోకి వస్తే 'ఏంట్రా ఆడపిల్లలాగా' అని మందలిస్తారు. కాని వంట స్త్రీలకూ, పురుషులకూ రావాలి. పిల్లలు ఎంత బాగా చదువుకున్నా వారికి కొద్దో గొప్పో వంట తెలిసుండాలి. 'మాస్టర్ చెఫ్' తాజా విజేత ఆషిక్ మా అమ్మ నేర్పిన వంట వల్లే గెలిచాను అన్నాడు. మంగళూరులో చిన్న జ్యూస్ షాప్ నడుపుకునే ఆషిక్ ఇంత పెద్ద గెలుపుతో ప్రపంచాన్ని ఆకర్షించాడు.**

'సోనీ లివ్' చానల్ వారి ప్రఖ్యాత రియాలిటీ షో 'మాస్టర్ షెఫ్' సీజన్ 8 ఆడిషన్స్ రౌండ్‌లో ఆషిక్ చేసిన మంగళూరు స్టయిల్ ఫిష్ ఫ్రైను జడ్జీలు వెంటనే ఓకే చేయలేదు. 'కొంత బాగుంది కొంత బాగలేదు. మళ్లీ చెప్తాం' అన్నారు. కాని ఆ తర్వాత ఆషిక్‌కు అవకాశం ఇచ్చారు. అప్పటినుంచి అంటే అక్టోబర్ 18 నుంచి డిసెంబర్ 8 ఫైనల్స్ వరకూ ఆషిక్ చేసిన వంటకాల ప్రయాణం ఉద్వేగభరితంగానే సాగింది. ఎందుకంటే అతడు వంటను శాస్త్రోక్తంగా నేర్చుకోలేదు. అమ్మ దగ్గర ఇంట్లో వంటగదిలో నేర్చుకున్నాడు.

### 24 ఏళ్ల కుర్రాడు

మంగళూరుకు చెందిన ఆషిక్ వయసు 24 ఏళ్లు. దిగువ మధ్య తరగతి కుటుంబం. ఇంటర్ తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్ చేద్దామనుకున్నాడు. కాని ఫీజు కట్టే పరిస్థితి లేక కట్టలేదు. ఏం చేయాలి. వంట బాగా వచ్చు. యూ ట్యూబ్‌లో చూసి రకరకాల వంటకాలు చేయడం నేర్చుకున్నాడు. దానికి కారణం చిన్నప్పటి నుంచి అతని ఆటలన్నీ వంట గదిలోనే సాగేవి. నానమ్మ వంట చేస్తుంటే అక్కడే కూచుని చెంబులు తప్పేళాలతో ఆడుకునేవాడు. అమ్మ హయాం వచ్చేసరికి వంటలో సాయం పట్టడం మొదలెట్టాడు. తల్లి – 'ఏమిటీ ఆడంగి పనులు' అని తిట్టకుండా కొడుకును ప్రోత్సహించింది. ఇంటికి ఎవరొచ్చినా ఆషిక్ వంట చేసే పద్ధతి చూసి ఆశ్చర్యపోయేవారు. ఆ ఆత్మవిశ్వాసంతో మంగళూరులో 'కులుక్కి' పేరుతో చిన్న జ్యూస్ షాప్ పెట్టాడు ఆషిక్. అయితే అది సగటు జ్యూస్‌షాప్ కాదు. ఆషిక్ కనిపెట్టిన రకరకాల ఫ్లేవర్లు, మిక్స్‌డ్ కాంబినేషన్లు అందులో దొరుకుతాయి. జనం బాగా కనెక్ట్ అయ్యారు. అతని జ్యూస్ షాప్ మంచి హిట్. కాని ఇంకా జీవితంలో సాధించాలి అంటే ఏదైనా పెద్దగా చేయాలనుకున్నాడు ఆషిక్. 'మాస్టర్ షెఫ్' అందుకు వేదికగా నిలిచింది.

### విఫలమైనా ముందుకే

2022 మాస్టర్ షెఫ్ ఆడిషన్స్‌కు వచ్చిన ఆషిక్ రిజెక్ట్ అయ్యాడు. 'చాలా డిప్రెషన్‌లోకి వెళ్లాను. మళ్లీ ఏమీ వండలేననే అనుకున్నాను. కాని సాధించాలి... మనసుపెట్టి పోరాడాలి అని నిశ్చయించుకున్నాను. 2023 ఆడిషన్స్ వచ్చేవేళకు చాలా కష్టపడి తర్ఫీదు అయ్యాను సొంతగా. షో ముందుకు వెళ్లేకొద్దీ సవాళ్లు ఎదురైనా ఛేదిస్తూ విజేతగా నిలిచాను' అన్నాడు ఆషిక్.



తల్లితో ఆషిక్

ఫైనల్స్ ఎపిసోడ్‌లో ఆషిక్ తల్లిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆమె సమక్షంలోనే ఆషిక్‌ను విజేతగా ప్రకటించారు. కొడుకు విజేత అవుతాడో లేదో నని ఆమె ఉత్కంఠగా ఎదురు చూసింది. ఆపై కొడుకు విజయానికి పులకించిపోయింది.

కాగా ఈ సీజన్‌లో మేఘాలయాకు చెందిన స్కూల్ ప్రిన్సిపల్ నంబి మొదటి రన్నర్ అప్‌గా, జమ్ము–కశ్మీర్‌కు చెందిన రుక్సర్ అనే ఫుడ్ టెక్నిషియన్ సెకండ్ రన్నర్ అప్‌గా నిలిచారు. ప్రసిద్ధ షెఫ్‌లు వికాస్ ఖన్నా, రణ్‌వీర్ బ్రార్, గరిమా అరోర జడ్జీలుగా వ్యవహరించారు. రొయ్యలతో ఆషిక్ చేసిన 'క్రిస్పీ ప్యారడైజ్' అనే వంటకాన్ని రుచి చూసిన జడ్జ్ రణ్‌వీర్ బ్రార్ తన సంతకం కలిగిన కిచెన్ నైఫ్ బహూకరించడం విశేషం.

హోటల్ రంగంలోగాని, స్వయం ఉపాధికిగాని పాకశాస్త్రం నేడు చాలా అవసరంగా ఉంది. మంచి షెఫ్‌లకు చాలా డిమాండ్ ఉంది. ఆడైనా ఉన్నా తెల్లారి లేస్తే మూడుపూట్లా తినాలి కనుక, వంట కేవలం ఆడవారి వ్యవహారం అనే భావన పోయి, ఇకమీదైనా అబ్బాయిలకు తల్లులు కనీసం అవసరమైనంత వంట నేర్పడం మంచిది. ఏమో... వారు ఇంకా బాగా నేర్చుకుంటే మరో మాస్టర్ షెఫ్ అవుతారేమో. ఏ ప్లేట్‌కు ఏ పదార్థం రాసి పెట్టుందో ఎవరు (రుచి) చూసొచ్చారు కనుక.

కిచెన్‌టిప్స్

## కరకరలాడాలంటే...

బిస్కెట్లు మెత్తగా అవ్వకుండా కరకరలాడాలంటే ఇలా చేసిచూడండి...

- ప్లాస్టిక్, అల్యుమినియం డబ్బాలు, గాజు పాత్రల్లో బిస్కెట్లు, కుకీలను నిల్వచేయాలి. గాలి చొరబడకుండా పెడితే ఎక్కువరోజులపాటు క్రిస్పీగా ఉంటాయి.
- డబ్బాల్లో నిల్వచేసేటప్పుడు అడుగు భాగంలో రెండు మూడు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి తరువాత బిస్కెట్లు పెట్టాలి. బిస్కెట్లపైన మరో రెండు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి పైన బిస్కెట్లు పెట్టాలి. ఇలా నిండుగా పెట్టి గాలిచొరబడకుండా మూత పెట్టాలి.
- జిప్‌లాక్ పౌచ్‌లలో నిల్వచేస్తే కూడా కుకీలు తాజాగా ఉంటాయి.
- గాలి చొరబడని డబ్బాలు, జిప్‌లాక్ పౌచ్‌లను రిఫ్రిజిరేటర్‌లో పెడితే మరిన్ని రోజులు బిస్కెట్లు తాజాగా ఉంటాయి.
- అనుకోకుండా సరిగా నిల్వచేయనప్పుడు మెత్తబడిన కుకీలను అవెన్ లేదా ఎయిర్‌ఫ్రైయర్‌లో ఉంచి వేడి చేస్తే మళ్లీ క్రిస్పీగా మారతాయి. వీటిని కూడా నిల్వచేసుకోవచ్చు.



బ్యూటిప్స్ హెయిర్ కేర్

## జుట్టుకు బలాన్నిచ్చే టానిక్

బీట్‌రూట్ ఒకటి తీసుకుని చెక్కు తీసి ముక్కలుగా తరగాలి. రెండు ఉసిరి కాయలను గింజలు తీసేసి ముక్కలుగా కోయాలి. వీటికి పన్నెండు రెమ్మల కరివేపాకు, గ్లాసు నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని పదినిమిషాల పాటు మీడియం మంట మీద మరిగించాలి. చక్కగా మరిగాక దించేసి చల్లారిన తరువాత ఈ రసాన్ని వడగట్టి సీసాలో నిల్వచేసుకోవాలి. ఈ టానిక్‌ను వారానికి రెండు మూడుసార్లు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. రెండు గంటల తరువాత సాధారణ షాంపుతో కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కుదుళ్లకు పోషకాలు అందుతాయి. రక్తప్రసరణ చక్కగా జరిగి జుట్టు ఊడడం తగ్గుతుంది. చివర్లు చిట్లకుండా చక్కగా పెరుగుతాయి.



## జెల్ మెరుపులు

టేబుల్ స్పూను పంచదార పొడిలో స్పూను వేడి నీళ్లు పోసి కలపాలి. దీన్లో రెండు టీస్పూన్ల పచ్చి పాలు, స్పూను అలోవెరా జెల్ వేసి కలపాలి. శుభ్రంగా కడిగిన ముఖానికి ఈ మిశ్రమాన్ని రాసి మర్దన చేయాలి. పదినిమిషాలపాటు ఆరనిచ్చి కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల చర్మానికి తేమ అంది, మృదువుగా నిగారింపుతో కనిపిస్తుంది.





- మరుగుతున్న రెండు గ్లాసుల నీటిలో మూడు టేబుల్ స్పూన్ల టీపొడి, పది గులాబీ పువ్వులు వేసి పదినిమిషాలపాటు మరిగించాలి. ఇది చల్లారిన తర్వాత వడగట్టి ఒక సీసాలో పోయాలి. తలస్నానం చేసిన జుట్టుకు ఈ డికాషన్‌ను పట్టించి, టవల్ చుట్టుకోవాలి. నీటితో కడగకూడదు. ఇది కండీషనర్‌లా పనిచేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

**హెల్త్‌కేర్ ఇండస్ట్రీలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే కనిపిస్తున్నారు అని దస్రా ఆర్గనైజేషన్ ఒక డేటా విడుదల చేసింది. మహిళలు వైద్యవిద్యలలో 29 శాతం ఉంటే, నర్సింగ్ సిబ్బందిలో 80 శాతం ఉన్నారు. ఇక 100 శాతం ఆశావర్కర్లుగా ఉన్నారు. ఆరోగ్య సంరక్షణలో నాయకత్వ స్థానాల్లో కేవలం 18 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. ఈ రంగంలో పురుషుల కంటే 34 శాతం స్త్రీలు తక్కువ సంపాదిస్తున్నారు.**



* హెల్త్ కేర్ నివేదిక

# 'రోల్' లేదు 'మోడల్' లేదు!

## హెల్త్‌కేర్‌లో మహిళలు ఫ్రంట్‌లైన్‌కే పరిమితం

లాభాపేక్ష లేకుండా, అన్ని రంగాలలో సామాజిక మార్పునకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ దస్రా. ఈ సంస్థ హెల్త్ కేర్ రంగంపై దృష్టి పెట్టి, ఓ నివేదికను రూపొందించింది. ఈ నివేదికలో పొందుపర్చిన విషయాలలో ముఖ్యంగా గమనించాల్సింది మహిళలకు రోల్‌మోడల్స్ లేకపోవడం, వారి పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం గురించి సరైన అవగాహన లేకపోవడం అని పేర్కొంది.

### ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే..

భారతదేశంలో ప్రధానమైన హెల్త్‌కేర్ రంగం కొన్ని సంవత్సరాలుగా సాంకేతికత, నైపుణ్యాలు, విద్య, వృత్తిపరంగా గణనీయమైన అభివృద్ధి, విస్తరణను చవిచూసింది. అయినప్పటికీ ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలో కనిపిస్తున్నారని దస్రా నివేదిక సూచిస్తుంది. దస్రా డైరెక్టర్ శైలజా మెహతా మాట్లాడుతూ 'ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళల నాయకత్వంలో మార్పు తీసుకురావడం చాలా అవసరం. ఎందుకంటే, ఇతర రంగాలను కూడా హెల్త్‌కేర్ ప్రభావితం చేయడమే కారణం. లింగ సమానత్వం విషయంలో మా పనిలో మేం మహిళల పురోగతికి సంబంధించిన గ్యాప్‌పై దృష్టి పెట్టాలనుకున్నాం' అని తెలిపారు.

### అతి తక్కువ శాతం

నివేదిక ఫలితాల ప్రకారం మొత్తం హెల్త్‌కేర్ వర్క్ ఫోర్స్‌లో 54 శాతం ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ సెక్టార్‌లో మహిళలు దాదాపు 25 నుంచి 30 శాతం నాయకత్వ స్థానాలను ఆక్రమించారు. ఫార్మాస్యూటికల్, బయోటెక్ రంగాలలో 5 నుంచి 10 శాతం మాత్రమే నాయకత్వపాత్రల్లో మహిళలు ఉన్నారు. మార్కెటింగ్ కార్యకలాపాల స్థానాల్లో కూడా మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. ప్రవేశ స్థాయి స్థానాల్లో మహిళలు 40 నుంచి 50 శాతం ఉండగా, సీనియర్ పాత్రలలో ఈ శాతం గణనీయంగా 15 నుంచి 20 శాతానికి పడిపోయింది.

### పరిమిత ప్రాధాన్యం

మహిళలు ఆర్ అండ్ డి, నర్సింగ్, హెచ్‌ఆర్, పరిపాలన, నాణ్యత హామీ, చట్టపరమైన, నియంత్రణ వ్యవహారాలు వంటి విధుల్లో బాగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇవి పరిమిత ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ముఖ్యంగా ఎంట్రీ లెవల్ హెచ్‌ఆర్ పాత్రల కోసం మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది. దీని ఫలితంగా గణనీయంగా 70–80 శాతం ప్రాతినిధ్యం ఉంది. ఇదే నాయకత్వ స్థానాల్లో 20 నుంచి 30 శాతానికి పడిపోతుంది. నివేదిక ఫలితాలు, రోగుల సేవా బృందాలు, ఎఫ్ అండ్ బి మొదలైన వాటిలో ఇదే విధమైన నమూనాను గమనించాయి. ప్రవేశ స్థాయిలలో 40 నుంచి 60 శాతం మహిళలను ప్రాధాన్యంగా నియమించుకుంటారు. అయితే సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ స్థాయులకు వారి పురోగతి పరిమితంగా ఉంది. ఇది 15 నుంచి 20 శాతానికి మాత్రమే చేరుకుంది.

### రోల్ మోడల్స్ లేకపోవడమే..

లీడర్‌షిప్ క్వాలిటీ పెంపొందించుకోవడానికి మహిళలకు ప్రధాన అవరోధం రోల్ మోడల్స్ లేకపోవడమే. మహిళల పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం, వైవిధ్యం గురించి నమ్మదగిన సాంస్కృతిక కథనం లేకపోవడం అని నివేదిక హైలైట్ చేసింది. శైలజా మెహతా మరిన్ని వివరాలు చెబుతూ 'అడ్డంకులు చాలా రెట్లు ఉన్నాయి. మహిళలు నిజంగా ప్రభావవంతంగా ఉన్నారా.. మంచి నాయకులు కాదా... అని ప్రశ్నించే మూస పద్ధతి కూడా ఒక కారణంగా ఉంది. మహిళల నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రతికూల పక్షపాతాలు, నిబంధనలు, ప్రవర్తనలు, ఊహాజనితాలు ఎన్నో ఉన్నాయి. వీటిని వదులుకోవడం అంత సులభం కాదు. సంస్థలు మెరుగైన వ్యాపారం కోసం ఆలోచిస్తాయే తప్ప మహిళా ఉన్నతిని పెద్దగా పట్టించుకోవు. హెల్త్‌కేర్ రంగంలో మహిళలు లీడర్‌షిప్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. భారతదేశంలో చాలా మంది మహిళలకు వారి ఆకాంక్షలకు కఠినమైన అడ్డంకులు ఉంటాయి. మహిళల లక్ష్యం నర్సు కావడమే అన్నట్టుగా ఉంటుంది. మేనేజర్‌గా లేదా సీఇవోగా ఉండటానికి వారికి అవకాశం ఇవ్వరు.

'మహిళలు తమ పరిమితులను దాటి, విస్తరించాలి. అడ్డుగోడలను, నిబంధనలను తొలగించుకుంటూ తమను తాము ప్రోత్సహించుకుంటూ ముందడుగు వేయాలి. అప్పుడే భవిష్యత్తు తరాలకు రోల్‌మోడల్స్‌గా నిలుస్తారు' అని చెబుతున్న దస్రా నివేదిక మనందరినీ ఆలోచింపజేస్తుంది.